# ప్రజాపాలన

జనవరి 02- 2019
బుధవారం
పేజీలు:8

## హైదరాబాద్ ప్లస్

హైదరాబాద్,రంగారెడ్డి,నల్లగొండ,మహబూబ్‌నగర్,ఖమ్మం,ఆదిలాబాద్,నిజామాబాద్,కరీంనగర్,మెదక్,వరంగల్, పెద్దపల్లి


## మరో రికార్డు సృష్టించిన హైదరాబాద్ మెట్రో..!



**హైదరాబాద్ (ప్రజాపాలన):** హైదరాబాద్ మెట్రో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. సోమవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 2.10లక్షల మంది ప్రయాణికులు మెట్రోరైళ్లలో ప్రయాణించారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10.30 మధ్య మెట్రోలో విపరీతమైన రద్దీ నెలకొంది. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా మెట్రో అధికారులు అదనపు రైళ్లు నడిపారు. మెట్రో రైళ్లలో రద్దీ అనూహ్యంగా పెరుగుతున్నప్పటికీ ఎవరికీ అసౌకర్యం కలగకుండా మెట్రో సంస్థ అన్ని చర్యలు తీసుకుంది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 31న అర్ధరాత్రి వరకూ మెట్రో రైళ్లను నడిపిన విషయం తెలిసిందే.

## నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

**హైదరాబాద్ (ప్రజాపాలన):**చాంద్రాయణగుట్ట నుంచి ఇమ్లీబన్ 33/11కేవీ విద్యుత్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా చేసే అండర్ గ్రౌండ్ కేబుల్ మరమ్మతుల కారణంగా మలక్‌పేటలో జనవరి 2వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ట్రాఫిక్‌ను మళ్లించేందుకు చర్యలు చేపట్టినట్లు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.ముత్తు తెలిపారు. రోడ్డుపై తవ్వకాలు చేయనున్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండేందుకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి చాదర్‌ఘాట్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను, ఇతర వాహనాలను ముసారాంబాగ్ చౌరస్తా గోల్నాకా బ్రిడ్జి మీదుగా అంబర్‌పేట వైపు నుంచి మళ్లించనున్నట్లు ఆయన వివరించారు. దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్ వైపు వెళ్లే ఆర్టీసీ జిల్లా బస్సులు, సిటీ బస్సులను, ఇతర ప్రైవేటు వాహనాలన్నింటినీ ముసారాంబాగ్ చౌరస్తా నుంచి వయా గోల్నాకా న్యూ బ్రిడ్జి, నింబోలి అడ్డ, చాదర్‌ఘాట్ చౌరస్తా మీదుగా ఎంజీబీఎస్‌ను చేరుకుంటాయి.
సైదాబాద్ నుంచి చాదర్‌ఘాట్ వైపు వెళ్లే ఆర్టీసీ జిల్లా బస్సులు, సిటీ బస్సులు, ఇతర వాహనాలను వయా చంచల్‌గూడ జైలు చౌరస్తా, డబీర్‌పుర ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఏపీఏటీ, సాలార్‌జంగ్ చౌరస్తా నుంచి చాదర్‌ఘాట్ వైపు నుంచి నడుస్తాయి.



## యాదాద్రికి పోటెత్తిన భక్తులు



యాదాద్రి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవార ుజామున నాలుగు గంటల నుంచి స్వామివారి దర్శనానికి అనుమతినిచ్చారు. స్వాతి నక్షత్రం కావడంతో స్వామి వారికి అర్చకులు సహస్ర కళషాభిషేకం నిర్వహించారు. హైదరాబాద్‌తో పాటు యాదాద్రి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామిని దర్శించుకోటానికి భక్తులు పోటెత్తడంతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## టీఆర్ఎస్‌లో చేరడం లేదు: శ్రీధర్‌బాబు, గండ్ర



కరీంనగర్: తాము టీఆర్ఎస్‌లో చేరడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, గండ్ర స్పష్టం చేశారు. టీఆర్ఎస్‌లో చేరుతున్నామని మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం జిల్లాకు వస్తున్నారనే కలుస్తున్నామని వెల్లడించారు. అయితే కాళేశ్వరం రీడిజైనింగ్ ఆరోపణలపై కట్టుబడి ఉన్నామని శ్రీధర్‌బాబు, గండ్ర తెలిపారు.

## కల్వర్టు కిందకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు





మహబూబ్ నగర్ : జిల్లాలోని నారాయణపేట మండలం సింగారం ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న బైక్ ను తప్పించబోయి.. ఆర్టీసీ బస్సు కల్వర్టు కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో ఆర్టీసీ అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన బస్సు నారాయణపేట డిపోకు చెందినది.

# పాలమూరు ఎత్తిపోతల పనులను పరిశీలించిన రిటైర్డ్ ఇంజినీర్లు



మహబూబ్ నగర్ : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో రిటైర్డ్ ఇంజినీర్ల బృందం పర్యటిస్తోంది. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్నారు. కొల్లాపూర్ మండలం ఎల్లూరు రిజర్వాయర్ వద్ద సొరంగం పనులను, నార్లాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించారు. మరికాసేపట్లో ఏదుల, వట్టెం, కరివెన రిజర్వాయర్ పనులను రిటైర్డ్ ఇంజినీర్ల బృందం పరిశీలించనుంది. ఈ సందర్భంగా రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పాలమూరు ఎత్తిపోతల పనులను పరిశీలించేందుకు వచ్చామని తెలిపారు. ఈ నెల 4వ తేదీన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పనుల పురోగతిపై సీఎం కేసీఆర్ కు నివేదిక అందిస్తామని చెప్పారు. ప్రాజెక్టులన్నింటినీ త్వరగా పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎల్లూరు రిజర్వాయర్ వద్ద ప్రధాన టన్నెల్ 200 మీటర్లు పూర్తి కావాల్సి ఉందని తెలిపారు.

# అట్టహాసంగా జరిగిన మాలోతు కవిత జన్మదిన వేడుకలు



మహబూబాబాద్ బ్యూరో, జనవరి 1 (ప్రజా పాలన): మహబూబాబాద్ మాజీ శాసన సభ్యురాలు, తెరాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలోతు కవిత జన్మదిన వేడుకలు మహబూబాబాద్ లోని తన స్వగృహంలో జనవరి 1 న అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి తెరాస కార్యకర్తలు, అనుచరులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి కవితను దీవించారు. అనంతరం నేను సైతం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుభాని పాల్గొని మాలోతు కవిత కు మొక్కను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు కౌన్సిలర్లు, తెరాస మండల, గ్రామ నాయకులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ యువతి మృతి

మొగుళ్లపల్లి /ప్రజాపాలన : కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన సంఘటన పర్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం పర్లపల్లి గ్రామానికి చెందిన మండ స్రవంతి (17)గత కొంతకాలంగా కడుపు నొప్పి తో బాధ పడుతూ ఉండేది ఈ క్రమంలో బాధ భరించలేక గత బుధవారం నాడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. పనికి వెళ్లి వచ్చిన తల్లి సరోజన చూసి కేకలు వేయడంతో చుట్టూ పక్కల వారు వచ్చి చిట్యాల సామాజిక ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యులు వరంగల్ లోని యజియం పంపించడంతో చికిత్స పొందుతూ మంగళవారం నాడు ఉదయం మృతి చెందింది . అని గ్రామస్థులు తెలిపారు. స్రవంతి మృతి తో గ్రామములో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఇతర ఉద్యోగులకు స్ఫూర్తినిచ్చేలా సేవలుండాలి

ఎదులాపురం: ఇతర ఉద్యోగులకు స్ఫూర్తిగా, ఆదర్శంగా ఉండేలా సేవలు అందించినప్పుడే ప్రజలు శాశ్వతంగా గుర్తుంచుకుంటారని జిల్లా ఎస్పీ విష్ణు వారియర్ పేర్కొన్నారు. ఏఎస్పీగా పదవీ విరమణ పొందిన సాదు మోహన్‌రెడ్డిని ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో శాలువా కప్పి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందించి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ 1985 ఎస్ఐ బ్యాచ్‌కి చెందిన సాదు మోహన్‌రెడ్డి తన నిస్వార్థ సేవల వల్లనే అంచెలంచెలుగా ఎదిగి ఏఎస్పీ స్థాయికి చేరారని కొనియాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి సెలవులు పెట్టకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగటానికి ఎంతగానో కృషి చేశారన్నారు. సంఘటన స్థలాలకు సత్వరమే వెళ్లి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించటంలో ఆయన దిట్ట అని పేర్కొన్నారు. ఇతర అధికారులకు ఆదర్శంగా ఉండేలా ఆయన అందించిన సేవలు మరవలేనివన్నారు. సోమవారం పదవీ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ సయ్యద్ కౌసర్‌అలీ, హెడ్‌కానిస్టేబుల్ టి.సుధామ్, ఎ.చంద్రకాంత్‌లను సైతం ఈ సందర్భంగా ఎస్పీ సన్మానించారు. పదవీ విరమణ పొందిన ఏఎస్పీ సాదు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణ చివరి సమయంలో ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు సేవలందించటం సంతృప్తినిచ్చిందని, ఇక్కడి ప్రజలు సౌమ్యులని, సరైన మార్గనిర్దేశం చేసినట్లయితే మరింత అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ పరిపాలనాధికారి అశోక్‌కుమార్ విశిష్ట, డీఎస్పీ కే.నర్సింహారెడ్డి, పట్టణ సీఐలు వి.సురేష్, కే.నాగరాజు, ఇచ్చోడ సీఐ ఎస్.సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా న్యాయమూర్తిని కలిసిన పాలనాధికారి, ఎస్పీ

ఎదులాపురం, న్యూస్‌టుడే: హైకోర్టు విభజనలో భాగంగా ఇక్కడ నుంచి బదిలీ అయిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికను జిల్లా పాలనాధికారి దివ్య దేవరాజన్, ఎస్పీ విష్ణు వారియర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె న్యాయమూర్తిగా వివిధ హోదాల్లో ఇక్కడ అయిదేళ్లు పని చేసిన అనుభవంతో వారికి పలు సూచనలు, సందేశాలు ఇచ్చారు.

## సర్కారు వైద్య సేవలపై సమీక్ష



సిద్దిపేట: ప్రభుత్వ వైద్య కళాశాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై మాజీ మంత్రి, సిద్దిపేట టీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి సంబంధించిన అకౌంట్స్ విషయంలో జవాబుదారీతనంతో పని చేయాలని ప్రభుత్వ సిబ్బందికి సూచించారు. పాత ఎంసీహెచ్‌ని వైద్య కళాశాల ఆధీనంలోకి తీసుకుని వినియోగించుకోవాలన్నారు. రేడియాలజిస్టులు 24 గంటలూ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆసుపత్రిలో పోర్టుమార్టం చేయడంలో వైద్యులు నిర్లక్ష్యంగా ఉండటం.. సమయానికి వైద్యులు అందుబాటులో ఉండకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ సేవలు, కళాశాల విద్యార్థుల బస్, డెంటల్ సిబ్బందికి వాహనాలు తొందరలోనే అందుబాటులోకి తేవాలని డీఎంఈని ఫోన్‌లో ఆదేశించారు. అందుకు అవసరమైన నిధులు ఆసుపత్రి అభివృద్ధి నిధి నుంచి సమకూర్చుకోవాలని సూచించారు. అలాగే పక్షవాతం బారిన పడిన రోగులకు సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## లారీ - కారు ఢీకొని ఇద్దరు మృతి

హుజూరాబాద్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి దగ్గర మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ- కారు ఢీ కొనడంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు శంకరపట్నం మండలం ఎరుకలగూడెం గ్రామస్తులుగా గుర్తించారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# ఘనంగా క్రిస్మస్ పండుగ





కంగ్టి,ప్రజాపాలన:మండల పరిధిలోని చౌకన్ పల్లి గ్రామంలో డిసెంబర్ 31 రాత్రి స్థానిక చర్చిలో పాస్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 12గంటల వరకు ఏసు ప్రభు పాటలతో భక్తి పారవశ్యంతో భజనలు నిర్వహించారు.గ్రామానికి చెందిన క్రిస్టియన్,ప్రజలు భజన కార్యక్రమంలో పాల్గొని ఏసు ప్రభు ఆశీస్సులు పొందారు.ఈ ఏడాదిలో అందరికి మంచే జరగాలని సుఖం సంతోషాలతో ఉండేటట్లు ప్రజలను ఆశీర్వదించాలని పాస్టర్ సంజీవ్ దేవుడిని ప్రార్థించారు.అనంతరం కేక్ కట్ చేసి నూతన సంవత్సరంను వెల్ కం చెప్పారు.కొత్త సంవత్సరంను పురస్కరించుకొని మంగళవారం మధ్యాహ్నం చర్చిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన చలిగాలులు

రాష్ట్రంలో చలి మళ్లీ ఉధృతమైంది. పది రోజుల క్రితం పెథాయ్ తుపాను సందర్భంగా రాష్ట్రంపై పంజా విసిరిన చలిపులి.. మరోసారి తన ప్రతాపం చూపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చలిగాలులు తీవ్రం కావడంతో జనం వణికిపోయారు. పలుచోట్ల ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. ఆదిలాబాద్‌లో రికార్డు స్థాయిలో 4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇంత తక్కువ ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే తొలిసారి. ఇక వికారాబాద్ జిల్లా తాండూరులో 5.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. 2013 డిసెంబర్ 9న 5.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, తాజాగా అంతకంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.మెదక్‌లో శుక్రవారం 6.8 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రత.. శనివారం 5.8 డిగ్రీలకు పడిపోయింది. దక్షిణ కోస్తా ఒడిశా, ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనంగా మారడంతో రాష్ట్రంలో రాగల మూడ్రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కొమురంభీం, మంచిర్యాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఆదివారం చలిగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్‌నూ చలి వణికిస్తోంది. శనివారం గ్రేటర్‌లో రికార్డు స్థాయిలో 9.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది.2010 డిసెంబర్ 21న 8.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా, ఎనిమిదేళ్ల తర్వాత సాధారణం కన్నా ఐదు డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రత నమోదైంది. చలి కారణంగా ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.



**అంబరపేట, జనవరి1,ప్రజాపాలన:ఆర్టీసీ క్రాస్ రోడ్డు లోని వివిఎస్టీ లో నూతన సంవత్సర వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం పదవి విరమణ చేసిన పి.ఎస్.మాధవన్ ను ఘనంగా సన్మానించారు.**

# 'కారు' ఎక్కనున్న అజారుద్దీన్?

హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అజారుద్దీన్ పార్టీ వీడేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇటీవల ఓ ఎంపీ కూతురు వివాహంలో టీఆర్ఎస్ కీలక నేతలతో ఆయన చర్చలు జరిపినట్టు తెలిసింది. ఆ ఎంపీ సైతం అజారుద్దీన్‌ను పార్టీలోకి తీసుకొని సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వాలని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు విజ్ఞప్తి చేసినట్టు తెలుస్తోంది. సంక్రాంతి తర్వాత టీఆర్ఎస్‌లో అజారుద్దీన్ అధికారికంగా చేరుతున్నట్టు ఆయన సన్నిహితులు, అభిమానులు వెల్లడించారు.

**2009లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా..**

క్రికెటర్‌గా పేరు ప్రఖ్యాతులు పొందిన అజారుద్దీన్ 2009 ఫిబ్రవరిలో కాంగ్రెస్‌లో చేరారు. ఆ ఏడాదే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరా దాబాద్ స్థానం నుంచి గెలుపొందారు. 2014లో పోటీకి దూరంగా ఉన్నారు. ఆ తర్వాత ఆయన పూర్తిగా తెలంగాణకే పరిమితమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఆయన్ను పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ నియమించింది. ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడటంతో అజారుద్దీన్ రాజకీయ భవిష్యత్ కోసం పార్టీ మారాలని నిర్ణ యం తీసుకున్నట్టు సన్నిహితులు పేర్కొన్నారు.

**అందుబాటులోకి రాని అజారుద్దీన్..**

టీఆర్ఎస్‌లో చేరే విషయంపై 'సాక్షి' అజారుద్దీన్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు. తనకు సన్నిహితులుగా పేరున్న ఇతర కాంగ్రెస్ నేతలు మాత్రం ఆయన త్వరలోనే టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటారని, సికింద్రాబాద్ ఎంపీ స్థానా న్ని టీఆర్ఎస్ ఆయనకు కేటాయించే అవకాశాలున్నాయని తెలిపారు. కాగా, సోమవారం గోల్కొండ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ సమీక్ష సమావేశానికి కూడా అజార్ హాజరయ్యారు.

# నూతన సంవత్సరంలో ప్రజలు సిరిసంపదలతో వర్ధిల్లాలి

## ◆నియోజకవర్గ ప్రజలకు డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ శుభాకాంక్షలు
## ◆పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన డి ఎస్పి



మహబూబాబాద్ బ్యూరో, జనవరి 1 (ప్రజా పాలన): 2018 సంవత్సరం లో రాష్ట్ర ప్రజలు టిఆర్ యస్ పార్టీ కి మరిచిపోలేనంత గుర్తింపును కల్పించారని అలాగే 2019 సవత్సరం లో కూడా ప్రజల ఆశీస్సులతో రాష్ట్రం వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు డోర్నకల్ ఎమ్మెల్యే డియస్ రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే స్వగృహం ఉగ్గంపల్లి గ్రామంలో పలువురు అధికారులు పార్టీ నాయకులు ఎమ్మెల్యే రెడ్యకు పుష్ప గుచ్ఛాన్ని అందించి నూతన సవంత్సర శుభాకాంక్షలు తెలిపారు .వచ్చే జనవరి నాటికి నియోజకా వర్గంలో కాళేశ్వరం నీటితో నియోజకవర్గాన్ని సశ్యశ్యామలం చేస్తామని ఈ నేపద్యంలో నియోజకవర్గంలో ని ప్రజలు సిరి సంపదలతో ,సుఖసంతోసలతో వుండాలని కోరుతున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో తొర్రూర్ డిఎస్పి మదన్ లాల్ ,మరిపెడ సి ఐ కరుణాకర్ ఎస్సైలు ప్రసాద్ రావు ,పవన్ కుమార్ ,నదీప్ కుమార్ ,సంతోష్ రావు తో పాటు జిల్లా గ్రందాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు ,ఎపిపి లు రాణి ,సుజాత ,ఉమా,రమ్య,జెడ్పిటిసిలు మాణిక్యం ,వేణు ,కవిత,స్వరుప ,మండల కోఆప్సన్ సభ్యుడు అయూబ్ పాషా,యుజన నేత డియస్ రవిచంద్ర నాయక్ , టిఆర్ యస్ నాయకులు రామసహాయం సత్యనారాయణ రెడ్డి ,రామడుగు అచ్యుత్ రావు , తాళ్ళ పెల్లి శ్రీనివాస్ ,పానుగోతు రాంలాల్ ,ముదిరెడ్డి బుచ్చిరెడ్డి ,కుడితి మహేందర్ రెడ్డి , గుగులోతు వెంకన్న , గందసిరి అంబరీష ,తోట లాలయ్య ,మాజీ సర్పంచులు ,ఎంపిటిసిలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఎమ్మెల్యే రెడ్యానాయక్ కు శుభాకాంక్షలు తెలిపారు

## ఏడాదిలో మీడియా అకాడమీ భవనం: అల్లం

హైదరాబాద్: ఏడాది కాలంలో మీడియా అకాడమీ భవనాన్ని నిర్మిస్తామని అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ చెప్పారు. కొత్త భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసిందన్నారు. భవన నిర్మాణ పనులు పూర్తయితే జర్నలిజం కోర్సులను ప్రారంభిస్తామన్నారు. సోమవారం అకాడమీ పాలకవర్గ సమావేశం జరిగింది. ఇటీవల మరణించిన 47 మంది జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర అనారోగ్యం బారిన పడ్డ 16 మంది వర్కింగ్ జర్నలిస్టు లకు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించారు. మల్లేపల్లి లక్ష్మయ్య, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్: టీ–సేవ ద్వారా ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టీ–సేవ ఆన్‌లైన్ ద్వారా వివిధ రకాల బిల్లుల చెల్లింపులు, బస్సు, రైలు, విమానాల టికెట్ల బుకింగ్, న్యూ పాన్‌కార్డు దరఖాస్తు, సవరణ, వివిధ టెలికాం పోస్ట్‌పెయిడ్, ప్రీ పెయిడ్ రీచార్జీలు, మనీ బ్యాంకు ట్రాన్స్‌ఫర్లు, ఆధార్ పేమెంట్ సిస్టమ్ ద్వారా వినియోగదారులకు సేవలందిస్తూ అభ్యర్థులు స్వయం ఉపాధి పొందవచ్చన్నారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీసేవసెంటర్.కామ్‌లో సంప్రదించాలన్నారు. జనవరి 26న ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 8179955744, 9505800050లను సంప్రదించాలని పేర్కొన్నారు.

# బీసీల లెక్కలు తేల్చాకే 'పంచాయతీ'

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని లక్ష్యంగా చేసుకొని అసభ్యకర భాషలో విమర్శిస్తున్నారని తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ అన్నారు. సుప్రీంకోర్టుకు బీసీ జనాభా లెక్కలు సమర్పించి రిజర్వేషన్లు ఖరారు చేసిన తరువాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడి ఆదర్శ్‌నగర్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ద్వారా జరిగే మార్పులు ఏమీ ఉండవని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు తీవ్ర ప్రభావం చూపిందన్నారు.

తెలంగాణ అమరులు, ఉద్యమకారుల సంక్షేమం గురించి కేసీఆర్ ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. వివిధ పత్రికలు, చానెళ్లను చెప్పుచేతల్లో పెట్టుకోవాలనే ఉద్దేశంతో యాజమాన్యాలను బెదిరించడం అప్రజాస్వామికమన్నారు. సుధాకర్ సమక్షంలో తెలంగాణ జనసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి కాసుల క ృష్ణ ఇంటి పార్టీ కండువా కప్పుకున్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం ఇంటి పార్టీయేనని, అందుకే ఈ పార్టీలో చేరుతున్నానని కాసుల క ృష్ణ తెలిపారు. సమావేశంలో ఇంటి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొమ్మాట వెంకటేశ్వర్లు, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, నేతలు కొమురయ్య, హరీశ్‌యాదవ్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో రోడ్డు ప్రమాదం...ఒకరు మృతి

బాన్సువాడ: కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కొనాపూర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వ్యక్తిని నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు పులిగుండు తండాకు చెందిన దిగంబర్‌గా గుర్తించారు.

## తమీమా ఫాతిమాకు ఇన్‌స్పైర్ అవార్డు

హైదరాబాద్: సైన్స్ రంగంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్‌స్పైర్ ప్రోత్సాహక అవార్డును యూసుఫగూడ సాయిక ృప పాఠశాల విద్యార్థిని తమీమా ఫాతిమా సొంతం చే సుకుంది. సోమవారం ఆబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో వెంకటనర్సమ్మ ఇన్‌స్పైర్ అవార్డును తమీమా ఫాతిమాకు అందజేశారు. మహిళలకు రక్షణ కల్పించే సురక్షా బ్రాండ్ (లైఫ్ సేవర్ ఫర్ ఉమెన్)ను రూపొందించినందుకు ఈ అవార్డును పొందినట్లు ఫాతిమా తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఫాతిమా తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.అంజనారావు, డిప్యూటీ డీఈవోలు చిరంజీవి, శామ్యూల్‌రాజ్, జిల్లా సైన్స్ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ కన్నుమూత

హైదరాబాద్: పాతనగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు మహ్మద్ ఫయాజ్ అస్గర్ అహ్మద్ సోమవారం కన్నుమూశారు. కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధ సమస్యతో బాధపడుతూ మలక్‌పేటల్‌లోని హైదరాబాద్ కిడ్నీ సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థి తి విషమించడంతో సోమవారం ఉదయం ఆస్పత్రిలో కన్నుమూశారు.

## జర్నలిస్టు యూనియన్ నేతల సంతాపం

ఉర్దూ సీనియర్ జర్నలిస్టు, టీయూడబ్ల్యూజే సీనియర్ నాయకుడు అస్గర్ అహ్మద్ ఆకస్మిక మరణం వర్కింగ్ జర్నలిస్టు ఉద్యమానికి తీరని లోటని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే సలహాదారు కె.శ్రీనివాసరెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమంలో అస్గర్ అహ్మద్ పోషించిన పాత్ర అమోఘమని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఎం.ఎ.మాజీద్, ఐజేయూ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గసభ్యులు కె.సత్యనారాయణ, టీయూడబ్ల్యూ జే నాయకులు వి.యాదగిరి, హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉర్దూ జర్నలిస్టులను సమన్వయం చేసి పలు ఉద్యమాలు నిర్వహించిన అస్గర్ అహ్మద్ మరణం జర్నలిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సాయి మోక్ష



హైదరాబాద్: అద్భుత మేధాశక్తితో నెల్లూరు జిల్లాకి చెందిన పత్తిపాటి సాయి మోక్ష ఒకఏడాదిలో 20 జాతీయ, రాష్ట్ర స్థాయి చదరంగం టోర్నమెంట్‌లలో పాల్గొని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నారు. ఈ మేరకు సోమవారం లాలాపేట్‌లోని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. చింతపట్ల వెంకటాచారి చిన్నారికి జ్ఞాపికను, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డా. చింతపట్ల వెంకటాచారి మాట్లాడుతూ ఏడు సంవత్సరాల వయసులో పత్తిపాటి సాయి మోక్ష 2018లో జరిగిన వివిధ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో 20 చదరంగం టోర్నమెంట్‌లలో పాల్గొనడం ఒక అరుదైన రికార్డుగా భావించి, సూపర్ కిడ్స్ విభాగంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించామన్నారు.

ప్రజాపాలన

# ఈ ఐస్ కరగదు..!



డీప్ ఫ్రిజ్‌లో ఉన్న ఐస్‌ముక్కను తీసి కాసేపు చేతిలో పట్టుకుంటే నెమ్మదిగా కరిగిపోతుంది. ఇప్పుడు వేసవికాలం కాబట్టి ఇంకా త్వరగా కరిగిపోతుంది. కానీ మండు వేసవిలోనూ గుహలో ఉన్న ఐస్ మాత్రం కరిగిపోదు. ఏడాదంతా మంచుతోనే ఉంటుంది.

చైనాలోని షాంక్సి ప్రాంతంలో ఆ దేశంలోనే అతి పెద్ద మంచు గుహ ఉంది. ఆ గుహలో ఎక్కడ చూసినా మంచే కనిపిస్తుంది. గోడలు, కిందా, పైనా... ఎక్కడ ముట్టుకున్నా చల్లగా మంచు తగులుతుంది. ఆ గుహను 'నింగ్వు కేవ్' అని పిలుస్తారు.

బయట వేడి ఎంత ఉన్నా గుహలోపల మంచు మాత్రం కొంచెం కూడా కరగదు. ఒకటి రెండు రోజులు కాదు. ఆ వేసవికాలం మొత్తంలోనూ మంచు కరగదు. యూరప్, ఉత్తర అమెరికా, అలస్కా, రష్యాలోని కొన్ని ప్రాంతాల్లో చలికాలంలో మాత్రమే కనిపించే అరుదైన ద ృశ్యం ఇక్కడ వేసవిలోనూ కనిపిస్తుంది. వేసవిలోనూ మంచు కరగకపోవడం ఆశ్చర్యమే. అయితే దాని వెనకా కారణం ఉంది. ఇలాంటి గుహలను 'కోల్డ్‌ట్రాప్స్' అని పిలుస్తారు. ఇవి సహజసిద్ధంగా ఏర్పడినవే అయినా వీటిలో ప్రత్యేకత ఉంటుంది. చలికాలంలో చల్లటిగాలి లోపలకి వచ్చేలా దారి ఉంటుంది. కానీ వేసవిలో వేడిగాలి లోపలకు రాదు. చలికాలంలో గుహలోకి చేరిన చల్లటిగాలి గుహలో సెటిల్ అయి ఉంటుంది. తేలికగా ఉన్న వేడిగాలి లోపలికి ప్రవేశించలేదు. ఫలితంగా గుహలో మంచు కరగకుండా అలాగే ఉంటుంది.

గుహ లోపల ఉన్న మంచు బఫర్‌గానూ పనిచేసి ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. గుహలోపలికి కొద్దిగా వేడిగాలి ప్రవేశించినా వెంటనే చల్లబరుస్తుంది. ఇలాంటి మంచు గుహలు ఆస్ట్రియాలోని వెర్ఫిన్, అమెరికాలోని లోవ ప్రాంతంలోనూ ఉన్నాయి. ఆస్ట్రియాలో ఉన్న ఐస్ కేవ్ ప్రపంచంలోనే అతి పెద్దది.

# శ్రమలో దాగిన స్వర్ణం



అమరావతి నగరంలో శివయ్య అనే వ్యవసాయ కూలీ ఉండేవాడు. ఒకరోజు పొరుగు గ్రామంలో పూరి ఇల్లు కప్పే పని పూర్తి చేసుకుని అమరావతికి బయలుదేరాడు శివయ్య. వస్తుంటే పొలిమేరల్లో ఉన్న సదానందుని ఆశ్రమానికి వెళ్లాడు. అప్పుడే సంధ్యావందనం పూర్తి చేసుకుని వచ్చిన సదానందుడు, శివయ్యను చూస్తూ 'ఏం నాయనా! ఇలా వచ్చావు' అన్నాడు.

'స్వామీ! నేను ఉన్నంతలో నా సాటి వారికి సాయపడుతూనే వచ్చాను. అటువంటి నాకు ఇంత కష్టతరమైన జీవితమా? తప్పుడు దారిన పయనిస్తూ నా కళ్లముందే ఎందరో ధనవంతులుగా మారారు. ఇదేమి న్యాయం?' అన్నాడు శివయ్య.

'నాయనా! అధర్మం తాత్కాలికంగా విజయం సాధించినా నీతి, నిజాయతీ, సత్యం చివరికి విజయం పొందుతాయి. నేను నీకు చేయగలిగిన సాయం ఏదైనా చేస్తాను నీ కోరికేంటో చెప్పు' అన్నాడు సదానందుడు.

'స్వామీ! నా కష్టంతో బంగారుమయమైన జీవితం లభించే మార్గం చెప్పండి. మీరు చూపించిన మార్గాన్ని అనుసరిస్తా.' అన్నాడు శివయ్య. క్షణకాలం ఆలోచించిన సదానందుడు తన కుటీరంలోకి వెళ్లి మూతిభాగం గుడ్డతో కప్పిన ఓ రాగి చెంబు తెచ్చి శివయ్య చేతికి ఇస్తూ 'నాయనా! ఇందులో 96 రాగి నాణాలున్నాయి. నువ్వు కష్టపడి కూడబెట్టిన నాలుగు బంగారు నాణాలు ఈ చెంబులో వేసి ఎప్పటిలా గుడ్డ కట్టి తర్వాతి రోజు ఉదయం ఈ చెంబు నేలపై బోర్లించి చూడు వంద బంగారు నాణాలు కనిపిస్తాయి. అలా జరగలేదంటే నీ శ్రమలో ఏదో లోపం ఉన్నట్లు. అప్పుడు మరో నాలుగు బంగారు నాణాలు సంపాదించి ఈ రాగి చెంబులో వేస్తే తప్పకుండా నీ బతుకు బంగారుమయం అవుతుంది.' అన్నాడు సదానందుడు.

సదానందుని మాటలకు సంతోషించిన శివయ్య అతనికి వందనం చేసి తన ఇంటికి చేరుకున్నాడు. మరుసటి రోజు నుంచి శివయ్య తన సంపాదనంతా జాగ్రత్తగా పదిల పరచసాగాడు. రేయింబవళ్లు శ్రమిస్తూ రెండు సంవత్సరాల కాలంలో నాలుగు బంగారు నాణాలు సంపాదించి రాగి చెంబులో వేసి ఆ రాత్రి ప్రశాంతంగా సంతోషంగా నిద్రపోయాడు. తెల్లవారుతూనే స్నానం చేసి భగవంతుని ప్రార్థించి చెంబులోని నాణాలను గుమ్మరించాడు. శివయ్య చెంబులో వేసిన నాలుగు బంగారు నాణాలు తప్ప మిగిలినవన్నీ రాగి నాణాల్లానే ఉన్నాయి. అప్పుడు శివయ్యకు 'నీ శ్రమలో ఏదైనా లోపం ఉంటే ఈ రాగి నాణాలు బంగారు నాణాలుగా మారవు' అన్న సదానందుడి మాటలు గుర్తొచ్చాయి.

తనకు తెలియకుండా తన శ్రమలో ఎక్కడో లోపం జరిగిందని చింతించాడు శివయ్య. గతంలో కన్నా పట్టుదలగా శ్రమించి కొంత కాలానికి మరో నాలుగు బంగారు నాణాలు సంపాదించి ఈ నాలుగు బంగారు నాణాలు రాగి చెంబులో వేసి మరుసటి రోజు చూశాడు. తను వేసిన ఎనిమిది బంగారు నాణాలు తప్ప చెంబులో ఉన్న రాగి నాణాల్లో ఎలాంటి మార్పూ రాలేదు. ఆశ్చర్యపోయిన శివయ్య రాగి చెంబు తీసుకుని సదానందుని ఆశ్రమం చేరి 'స్వామీ! మీరు చెప్పినట్లే ముందు నాలుగు బంగారు నాణాలు ఈ చెంబులో వేశా. కానీ చెంబులోని రాగి నాణాల్లో ఎటువంటి మార్పు రాలేదు. మీరు చెప్పినట్లే నా శ్రమలో ఏదైనా దోషం ఉందా అని మరోసారి నాలుగు బంగారు నాణాలు గడించి రెండోసారి ప్రయత్నించి చూశా. నా ఎనిమిది బంగారు నాణాలు తప్ప చెంబులోని రాగి నాణాల్లో ఎటువంటి మార్పు రాలేదు ఎందుకు ఇలా జరిగింది?' అన్నాడు.

## దారులు వెతకండి!



## రంగులు అద్దండి



# చిన్ని

## రాత్రివేళ.. కానీ చీకటి పడదు!



హాయ్ నేస్తాలూ! తెలుసా? సెలవుల్లో సరదాగా గడుపుదామని నేను నార్వేకి వెళ్లా. ఇప్పుడు అక్కడి నుంచే ఈ కబుర్లు చెబుతున్నా. ఇక్కడికి వస్తే ఎండాకాలంలోనే రావాలి. ఎందుకో తెలుసా? ఈ సమయంలో ఇక్కడో వింత జరుగుతుంది. అదేంటో చెబితే మీరూ ఆశ్చర్యపోతారు మరి. చెప్పేస్తున్నా.... మరేమో పగలూ రాత్రులు లేవు. మీరు సరిగ్గానే చదివారు. మే నుంచి జులై వరకు ఇంచు మించు 76 రోజులు ఆకాశంలో సూరీడు కనిపిస్తూనే ఉంటాడు. మన దగ్గరైతే రాత్రి అయితే పడుకుంటాం. పొద్దునయితే లేస్తాం. కానీ ఇక్కడ అసలు రాత్రే లేదు కదా. అందుకే టైం చూసుకుని పడుకోవాలి. టైం చూసుకునే పనుల్లోకి వెళ్లాలి. అర్ధరాత్రిపూట సూరీడును చూస్తుంటే మాత్రం నాకు భలే థ్రిల్లింగ్‌గా ఉందండోయ్.

లి పాపం... ఇలా సూర్యుడికి విశ్రాంతే లేదన్నమాట. ఉన్నా కొద్దిసేపే అది. ఈ మిడ్ నైట్ సన్ ఒక్క నార్వేలోనే కాదు. అమెరికాలోని అలాస్కా, ఉత్తర కెనడా, గ్రీన్‌ల్యాండ్, ఫిన్లాండ్, స్వీడన్ దేశాల్లోనూ ఉంటాడట. అందుకే వీటిని మిడ్‌నైట్ సన్ కంట్రీస్ అంటారు.

లి కేవలం ఈ దేశాల్లోనే ఎందుకబ్బా అని మా మామయ్యని అడిగితే బోలెడు సంగతులు చెప్పారు. ఈ దేశాలు ఉత్తర ధ్రువం దగ్గర ఉన్నాయి కాబట్టే. అవును ధ్రువాల దగ్గర మాత్రమే ఇలా సూర్యుడు రాత్రుళ్లూ వెలుగులీనుతాడు. మరేమో బొంగరంలా గిరగిరా తిరిగే భూమి రెండు చివరల్లో పైనా కిందా ఉత్తర, దక్షిణ ధ్రువాలు ఉంటాయిగా. ఉత్తర ధ్రువం చుట్టూ ఉండేది ఆర్కిటిక్ ప్రాంతం. దక్షిణ ధ్రువం చుట్టూ అంటార్కిటికా ఉంటుంది. ఏడాదిలో ఆరునెలలు ఉత్తర ధ్రువం సూర్యునికి దగ్గరగా ఉంటుంది. అప్పుడు ఈ ప్రాంతంలో ఎండాకాలం. అదే సమయంలో దక్షిణ ధ్రువం సూర్యునికి దూరంగా ఉంటుంది. అప్పుడు దక్షిణ ధ్రువంలో శీతకాలం. భూమి సూర్యుని చుట్టూ తిరిగినప్పుడు కొద్దిగా వంగడం వల్లే ఈ రుతువులు ఏర్పడతాయి. అలా ఈ ధ్రువాల్లో ఎండాకాలం ఉన్నప్పుడు మాత్రమే కొన్ని రోజుల పాటు ఈ మిడ్ నైట్ సన్ వింత ఉంటుందన్నమాట.

లి ఇది సరే... 'మన దగ్గర పగటి పూట ఎండకే హడలిపోతాం. మరి ఇలా రోజంతా ఉంటే ఎలా?' అని భయపడిపోనక్కర్లేదు. ఎందుకంటే ఇక్కడి ఎండ వెన్నెల్లా చల్లగా ఉంటుంది. ఎందుకో తెలుసా? ఇక్కడ సూర్యకిరణాలు ఎక్కువ దూరం వాతావరణంలో ప్రయాణం చేసేసి మొత్తం వేడిని కోల్పోతాయి. దీంతో కిందికి వచ్చేసరికి ఆ సూర్యకిరణాల వేడి ఉండదు. ఎండాకాలంలోనూ ఇక్కడ మరి ఎక్కువగా అంటే... ఉత్తర ధ్రువం దగ్గర 27 డిగ్రీల సెల్సియస్ వరకు చేరుతుందంతే. అదే మొత్తం మంచు ఆవరించి ఉన్న దక్షిణ ధ్రువం దగ్గరయితే మంచు కరిగే పరిస్థితి కూడా ఉండదట.

లి ఇంకో విషయం.... రాత్రుల్లో తిరుగుతుంటే గమ్మత్తుగా ఉంది. ఈ ప్రాంతాల్లో సూర్యుడి వెలుగులున్నా వీధుల్లో జనాలు తక్కువే. కానీ కొంత మంది బోలెడు ఆటలు ఆడుకుంటున్నారు. ఇలా రాత్రిపూట వెలుగును చూస్తే ఎంతో ముచ్చటేసింది. పరిసరాలన్నీ ఎంత అందంగా ఉన్నాయో! నేను చాలా ఫొటోలు కూడా తీశా. అయితే ఆకాశంలోకి చూడగానే ఒక్కసారిగా నాకో సందేహం వచ్చింది... మరి రాత్రుల్లో కనిపించే చంద్రుడు లేడే అని. అవును ఇలా మొత్తం సూరీడే ఉన్నప్పుడు చందమామ కనిపించలేదు నాకు. వెంటనే మా అమ్మనడిగితే చెప్పింది. ఇలా సూర్యుడు ఉన్నప్పుడు చంద్రుడు కనిపించడంట. ఎందుకంటే సూర్యచంద్రులు ఒకరికొకరు వ్యతిరేక దిశల్లో తిరగడం వల్లే. గమ్మత్తయిన సంగతులన్నీ మీతో చెప్పినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇక ఉంటానే బైబై!

# ఈ గుడికి వెళ్తే... యమబాధలు ఉండవట!

**దక్షిణాభిముఖంగా ప్రవహించే గోదావరి నదీతీరంలో వెలసిన ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ ఆలయం నవనారసింహ క్షేత్రాల్లో ఒకటిగా భాసిల్లుతోంది. దక్షిణ కాశీగా, తీర్థ రాజంగా, హరిహర క్షేత్రంగా విరాజిల్లుతున్న ఈ ఆలయం ఫిబ్రవరి 26 నుంచీ జరిగే బ్రహ్మోత్సవాలకు అంగరంగవైభవంగా ముస్తాబవుతోంది. దేశంలో మరెక్కడా లేని విధంగా ఆలయ ప్రాంగణంలో యమధర్మరాజు కోవెల ఉంది. ఈ కారణంగానే 'ధర్మపురికి వస్తే యమపురి ఉండద'నే నానుడి ప్రసిద్ధి చెందింది.**



'దక్షిణాభిముఖీ గంగా యత్ర దేవోన ృకేసరీ తత్ర శ్రీహ ృదయం తీర్థం కాశ్యాత్ శతగుణం భవేత్'... అనే శ్లోకం ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం విశిష్టతను చాటుతోంది. ఇక్కడ శ్రీలక్ష్మీనరసింహస్వామి యోగానంద రూపుడై భాసిల్లుతున్నాడు. స్వామివారి విగ్రహం మొత్తం సాలగ్రామ శిలతోనే తయారైంది. విగ్రహం చుట్టూ దశావతారాల ముద్రలు సుందరంగా కనిపిస్తుంటాయి. ప్రశాంత చిత్తంతో స్వామివారిని తలచినంతనే దుఃఖాలన్నీ తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

స్థలపురాణం

ధర్మవర్మ అనే మహారాజు ఈ ప్రాంతాన్ని రాజధానిగా చేసుకుని పాలించడం వల్లే ధర్మపురి అనే పేరు వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. వేయి సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ ఆలయం క్రీ.శ.1422-33 కాలంలో బహమనీ సుల్తానుల దండయాత్రలో ధ్వంసమైంది. తిరిగి ఈ ఆలయాన్ని 17వ శతాబ్దంలో పునరుద్ధరించినట్లు ధర్మపురి క్షేత్ర చరిత్ర తెలియజేస్తోంది. పామునే పతిగా పొందిన సత్యవతీదేవి ఎన్ని గుళ్లూగోపురాలూ తిరిగినా ఫలితం కనిపించలేదు. చివరికి ధర్మపురికి వచ్చి నృసింహస్వామిని దర్శించుకుందట. గోదావరిలో స్నానం ఆచరించగానే సత్యవతీదేవి భర్తకు సర్పరూపం పోయి సుందర రూపం వచ్చినట్లు స్థల పురాణం తెలుపుతోంది. అందువల్లే ధర్మపురిని దర్శించిన వారికి యమపురి ఉండదన్న నానుడి వచ్చిందని స్థానికుల విశ్వాసం. చారిత్రకంగానూ ఈ ప్రాంతం ప్రసిద్ధి పొందింది. ధర్మపురి పట్టణం వేదాలకూ, ప్రాచీన సంస్కృతికీ, సంగీత సాహిత్యాలకూ పుట్టినిల్లుగా పేరుగాంచింది. ఇక్కడ బ్రహ్మపుష్కరిణితోపాటు సత్యవతీ ఆలయం (ఇసుక స్తంభం) ప్రసిద్ధి చెందింది. స్వామివారిని దర్శిస్తే మానసిక, శారీరక బాధల నుంచి విముక్తి లభిస్తుందనీ, ఆయురారోగ్య, ఐశ్వర్యాలు సిద్ధిస్తాయనీ భక్తుల విశ్వాసం. దేవస్థానంలో పక్కపక్కనే ఉన్న ఉగ్ర, యోగస్వాముల ఆలయాలతోపాటు, శ్రీవేంకటేశ్వర, గోపాలస్వామి గుళ్లూ, ముందు భాగంలో శ్రీరామలింగేశ్వరుడి కోవెలా ఉన్నాయి.



ఉత్సవాలు

ఏటా ఈ ఆలయంలో శ్రీనృసింహ నవరాత్రి ఉత్సవాలూ, శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున కోనేరులో జరిగే పంచసహస్ర దీపాలంకరణల్లో పాల్గొనడానికి వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి చేరుకుంటారు. అలాగే ధనుర్మాసంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలూ, ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నుంచి 13 రోజుల పాటు బ్రహ్మోత్సవాలను ఇక్కడ ఘనంగా జరుపుతారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కళ్యాణోత్సవం, డోలోత్సవం, రథోత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. గోదావరి నదీ తీరంలో ఏటా కార్తీకమాసంలో అమావాస్య నుంచి పౌర్ణమి వరకూ నిత్యం గంగాహారతి ఇస్తారు.

ఇలా చేరుకోవచ్చు

జగిత్యాల జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ధర్మపురి ఉంటుంది. ఇక్కడి నుంచి ప్రతి 20 నిమిషాలకో బస్సు బయల్దేరుతుంది. కరీంనగర్ నుంచి ధర్మారం, వెల్గటూర్, రాయపట్నం మీదుగా 60 కిలోమీటర్ల దూరం ప్రయాణించి చేరుకోవచ్చు. రైల్లో రావాలనుకుంటే మంచిర్యాల స్టేషన్‌లో దిగి, లక్సెట్టిపేట మీదుగా 40 కిలోమీటర్ల దూరం రోడ్డు మార్గంలో ప్రయాణించి ధర్మపురికి చేరుకోవచ్చు.





# లెక్క తేలనున్న అటవీభూములు

హైదరాబాద్: తెలంగాణలో కొన్ని ఎకరాల అటవీ భూములకు సర్వే నంబర్లు లేవు. లక్షో రెండు లక్షల్లో కాదు.. ఏకంగా 15 లక్షల ఎకరాల వరకు అవి ఉన్నాయి. రాష్ట్రంలో పలుచోట్ల అటవీ భూముల అంశం వివాదాస్పదంగా ఉన్న నేపథ్యంలో ఈ భూముల లెక్కలు తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో సంబంధిత శాఖలు సర్వే చేయబోతున్నాయి. ఇందులో భాగంగా అటవీశాఖ ముసాయిదా మార్గదర్శకాలు రూపొందించింది. వీటిని రెవెన్యూశాఖకు అందించింది.

**దస్త్రాల పరిశీలన, డీజీపీఎస్ సర్వే**

అటవీ భూముల సర్వేలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా తన శాఖకున్న భూముల లెక్కలను అటవీశాఖ తీస్తోంది. మొత్తం 66 లక్షల ఎకరాల అటవీభూములు ఉన్నాయని ఉన్నతాధికారులు గుర్తించారు. అటవీ భూముల అంశం తరచూ వివాదాస్పదం అవుతుండటం, మరోవైపు అడవులు కబ్జాలకు గురవుతుండటం, ఇంకో వైపు తమకు పట్టాలు ఉన్నప్పటికీ అటవీ అధికారులు భూముల్లోకి వెళ్లనివ్వడం లేదంటూ గిరిజనులు, ఇతరులు ఆందోళన వ్యక్తం చేస్తున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఈ క్రమంలో అడవుల హద్దుల్ని తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రెవెన్యూ, అటవీ, భూకొలతలు, భూదస్త్రాల నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు ఇటీవల సమావేశమై సర్వే నిర్వహణ అంశాలపై చర్చించారు. అటవీభూముల లెక్కలు తేల్చేందుకు కసరత్తు చేసిన ఆ శాఖ ముసాయిదా మార్గదర్శకాలను రూపొందించింది. ఇందులో మూడు రకాల ప్రతిపాదనలు చేసింది. అవి..

1. అటవీశాఖ దస్త్రాలతో రెవెన్యూ దస్త్రాలను పోల్చడం. ఈ రెండింటిలో సరిపోలిన భూములను అటవీ భూములుగా గుర్తించడం.
2. క్షేత్రస్థాయిలోకి వెళ్లి సర్వే చేసి వివాదం లేని వాటిని అటవీ భూములుగా తేల్చడం.
3. అటు దస్త్రాల పరిశీలన, ఇటు క్షేత్రస్థాయి పరిశీలనలో పరిష్కారం కాని వాటిని వివాదస్పద భూములుగా తేల్చడం. డీజీపీఎస్ (డిఫరెంటల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సర్వే ద్వారా అటవీభూముల హద్దులు గుర్తించడం.

ఐదు జిల్లాల్లో ఎక్కువగా.. ఇప్పటివరకు సర్వే నెంబర్లు ఇవ్వని అటవీ భూములపై ముందు దృష్టి పెట్టాలని అటవీశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇలా దాదాపు 15 లక్షల ఎకరాల భూములు ఉండగా ఇందులో 80 శాతం వరకు ఆదిలాబాద్, మహబూబాబాద్, భూపాలపల్లి, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఉంటాయని అటవీశాఖ గుర్తించింది. సర్వే చేసి ఈ భూములకు కొత్త సర్వే నెంబర్లు ఇవ్వాలని రెవెన్యూ శాఖను కోరినట్లు అటవీశాఖ అధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు.

ఇదీ పరిస్థితి.. – రాష్ట్రవ్యాప్తంగా అటవీ భూములు: 66 లక్షల ఎకరాలు

– భూదస్త్రాల ప్రక్షాళనలో రెవెన్యూశాఖ పరిశీలించినవి: 45 లక్షల ఎకరాలు

– ఇంకా పరిశీలించాల్సినవి: 21లక్షల ఎకరాలు

# మార్కెట్ రమ్మంటోంది.. ధర పొమ్మంటోంది



హైదరాబాద్: ఉల్లికి ఉన్న శక్తి మరెవరికీ లేదు. ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వాలను కూల్చేస్తుంది. తగ్గినప్పుడు రైతుకు కన్నీరు తెప్పిస్తుంది. ధరలు ఆకాశాన్నంటినప్పుడు వినియోగదారుణ్ని విలవిలలాడిస్తుంది. ఇలాంటి పరిస్థితుల నుంచి రైతులను, వినియోగదారులను బయట పడేసేలా మార్కెటింగ్ శాఖ వ్యవహరించాలి. పంట చేతికొచ్చినప్పుడు సేకరించి, ధరలు పెరిగినప్పుడు అందుబాటు ధరల్లోకి తీసుకువచ్చే వ్యవస్థను అందిపుచ్చుకోవాలి. ఆ చొరవ, వ్యవస్థ మార్కెటింగ్ శాఖకు లేకపోవడం అటు రైతును, ఇటు వినియోగదారుడిని ఆదుకోలేకపోతోంది. హోల్‌సేల్ విపణిలో ఉల్లి ధరలు దారుణంగా పడిపోవడం, మరోవైపు చిల్లర విపణిలో ధర యథాతథంగా ఉండటమే ఈ పరిస్థితికి నిదర్శనం. మహారాష్ట్ర, కర్ణాటక, మహబూబ్‌నగర్, కర్నూలు నుంచి మలక్‌పేట మార్కెట్‌కు ఉల్లి పంట వస్తుంది. మహారాష్ట్రలో పంట కాలం ముగియడంతో అక్కడి పంట మార్కెట్‌ను ముంచెత్తుతోంది. సాధారణ రోజుల్లో రోజూ 19 నుంచి 20 వేల బస్తాల ఉల్లి ఇక్కడికి వస్తుంది. ఇప్పుడు 24 వేల బస్తాలకు పైగా వస్తుండటంతో ధరలు పతనమయ్యాయి. క్వింటాల్ ధర మొదటి రకం రూ.700–1000 మధ్య పలుకుతుండగా, రెండో రకాన్ని రూ.300–600లకే కొంటున్నారు. పోనీ ఆ మేరకు వినియోగదారునిపై భారం తగ్గిందా? అంటే అదీ లేదు. నగరంలో నాసిరకం ఉల్లిగడ్డ కూడా రూ.10–15 మధ్య అమ్ముతున్నారు. 'క్వింటాలు ఉల్లి పండించేందుకు రూ.700–800ల మధ్య వ్యయమవుతోంది. మార్కెట్‌కు తరలించే ఖర్చు కూడా కలిపితే అది రూ.వెయ్యి దాటుతోంది. హోల్‌సేల్ మార్కెట్లో ఉల్లి ధర కేవలం రూ.600–700లే పలుకుతోంది. తేమ ఉందనే సాకుతో రూ.300–500లకే అడుగుతున్నా వెనక్కి తీసుకెళ్లలేక తెగనమ్ముకుంటున్నాం' అని సరకు తెచ్చిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**నిల్వ చేసుకోవడం మేలు**

– అనంతయ్య, మలక్‌పేట మార్కెట్ కార్యదర్శి

కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా భారీగా ఉల్లి దిగుమతి అవుతోంది. రోజుకు సరాసరిన 10 వేల నుంచి 14 వేల క్వింటాళ్ల సరకు వస్తోంది. అందుకే ధరలు పడిపోయాయి. మార్చి నెలాఖరు వరకూ దాదాపు ఇదే పరిస్థితి ఉంటుంది. శక్తి ఉన్న రైతులు పంటను భద్రపరచుకుంటే మార్చి తర్వాత మంచి ధర దక్కుతుంది.

# చలి చంపేస్తోంది..



హైదరాబాద్: శీతల గాలుల ఉద్ధృతి పెరగడంతో రాష్ట్ర ప్రజలు చలితో ఇబ్బందుల పాలవుతున్నారు. ఉత్తర, ఈశాన్య భారత రాష్ట్రాల నుంచి రెండువైపులా శీతల గాలులు తెలంగాణవైపు వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా 6 డిగ్రీల వరకు తక్కువగా నమోదవుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆదిలాబాద్‌లో 5, మెదక్‌లో 8, రామగుండంలో 8, హన్మకొండలో 10, హైదరాబాద్‌లో 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు సైతం సాధారణంకన్నా తక్కువగా ఉంటున్నందున వేడి తగ్గింది. గాలిలో తేమ బాగా తగ్గడంతో పొడి వాతావరణం ఏర్పడుతోంది. హైదరాబాద్‌లో గాలిలో తేమ సాధారణంగా 75 శాతముండాలి. కానీ 51 శాతానికి పడిపోయింది. రాత్రి చలి, పగలు పొడి వాతావరణం వల్ల ప్రజలు శ్వాసకోశ సమస్యలతో అవస్థలు పడుతున్నారు. సోమ, మంగళవారాల్లో సైతం చలి ఇదే విధంగా కొనసాగే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి తెలిపారు. ఉత్తరాది నుంచి వచ్చే శీతల గాలులు తొలుత ఉత్తర తెలంగాణలో ప్రవేశిస్తాయని అందువల్లనే ఆదిలాబాద్, మెదక్‌లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా పడిపోవడం సాధారణం అని చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చలి వాతావరణం అధికంగా ఉంది. హిమాలయాల నుంచి దేశమంతటికీ శీతల పవనాలు అధికంగా వీస్తున్నాయి.

# పోలీసులమంటూ టోకరా

హైదరాబాద్: పోలీసులమని చెప్పి గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని బెదిరించి అతని వద్దనుంచి సరుకును లాక్కున్న ఓ ముఠాను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది అదుపులోకి తీసుకొంది. వారి నుంచి 8.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో సంఘటనలో ధూల్‌పేట నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

టోలీచౌకీ నుంచి ద్విచక్రవాహనంపై ఎండుగంజాయిని తరలిస్తున్న ఇషాక్ హుస్సేన్ అలియాస్ మున్వర్ హుస్సేన్(27)ను నాలాల్‌నగర్ వద్ద రూట్‌వాచ్ చేస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 8.2 కిలోల ఎండుగంజాయిని, హోండా యాక్టివా వాహనాన్ని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని విచారించగా ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించాడు. కింగ్‌కోఠి ప్రాంతానికి చెందిన నవీద్‌హుస్సేన్ (21), కార్వాన్‌లో నివసించే ఫైజల్ (26)తో కలిసి ఇషాక్ హుస్సేన్ ముఠాగా ఏర్పడ్డాడు. సికింద్రాబాద్ నుంచి ధూల్‌పేట్‌కు గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని ఈ ముఠా గమనించి వెంబడించారు. తాము పోలీసులమని చెప్పి రవాణా చేస్తున్న వ్యక్తిని బెదిరించి అతనివద్ద ఉన్న 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అందులో 10 కిలోల గంజాయిని ఇషాక్ హుస్సేన్ తనవద్దే ఉంచుకొని మిగతా ఇద్దరికి చెరో రెండు కిలోలు పంచాడు. ఇషాక్ హుస్సేన్ తనవద్ద ఉన్న గంజాయిలో కొంత విక్రయించాడు. మిగిలిన గంజాయిని విక్రయించేందుకు వెళుతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.

## సమరానికి సై

**❖ఖరారైన పంచాయతీ రిజర్వేషన్లు**

**❖వీడిన ఉత్కంఠ,గ్రామలలో వేడెక్కిన రాజకీయం**




నారాయణఖేడ్,కంగ్టి(ప్రజాపాలన):పల్లెల్లో పంచాయితీ ఎన్నికల సందడి మొదలైంది.రిజర్వేషన్లు ఖరారు కావడంతో రాజకీయాలు వేడెక్కాయి.నిన్నటి వరకు రిజర్వేషన్లపైనా గ్రామాల్లో చెలరేగిన తీవ్ర ఉత్కంఠకు తెరపడింది.

లికంగ్టి మండలంలో:చందర్ తండా,ముకుంద తండా,రాజారాం తండాలు ఎస్టీ మహిళా రిజర్వ్ కాగా,జిరిగి తండా సాదు తండా,కుంభ తండాలు ఎస్టీ జనరల్ రిజర్వ్ అయ్యాయి.చౌకన్ పల్లి,తుర్కవాడు గామ ఎస్సీ మహిళా రిజర్వ్ కాగా,చాప్టా (బీ),చాప్టా(కే)దమర్ గిద్ద బీసీ మహిళలకు రిజర్వ్ కాగా,తడ్కల్,గాజులు పాడ్,నాగూర్ (బీ),రసోల్ గ్రామాలకు బీసీ జనరల్ రిజర్వ్ అయ్యాయి.కంగ్టి,బిందా,దెగుల్ వాడి,బాబుల్ గావ్,నాగన్ పల్లి,నాగూర్ (కే ),బోర్గి,ఓసీ మహిళలకు రిజర్వ్ కాగా,సిద్ధ హంగిర్గా,సుక్కల్ తీర్థ్,జంగి కే,ఎనికే మురి,ముర్కున్ జాల్,రాంతీర్థ్,ఎడ్లరేగడి త

## కానిస్టేబుల్ ను అభినందించిన ట్రాఫిక్ ఎస్సై ఆరోగ్యం




జగిత్యాల. జనవరి 02 (ప్రజాపాలన): జగిత్యాల పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ కి గొల్లపల్లి రోడ్ లోని స్థానిక మోతే శివారులో ఓ మహిళా పర్సు దొరికింది. అందులో చూసేసరికి రూపాయలు 99605 ఉండగా అది గమనించిన కానిస్టేబుల్ గద్దం శాంతయ్య వారి యొక్క పూర్తి వివరాలు సేకరించి వారిని జగిత్యాల ట్రాఫిక్ ఎస్ఐ జన్ను ఆరోగ్యం చేతుల మీదుగా వారి యొక్క హ్యాండ్ బ్యాగ్ విలువైన పత్రాలు అందించడం జరిగింది .పోయిన బ్యాక్ దొరకడం వల్ల జగిత్యాల పోలీసువారికి భార్యభర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సై రాజయ్యకు సన్మానం



సారంగాపూర్. జనవరి 01 (ప్రజాపాలన): సారంగాపూర్ మండలం ఎస్ఐ శీలం రాజయ్య కు మహోన్నత సేవ పథకానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. రాజయ్య తో పాటు స్పెషల్ బ్రాంచ్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై గుర్రం రాజమౌళి రాష్ట్ర ప్రభుత్వం మహోన్నత సేవ పురస్కారాలకు ఎంపిక కావడం జగిత్యాల జిల్లా కు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల గౌరవ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ జిల్లా రెవెన్యూ సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎండి. వకీల్ కృష్ణ రాష్ట్ర కార్యదర్శి హనుమంత రెడ్డి డివిజన్ అధ్యక్షుడు నాయిని తిరుమలరావు శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జన్మదినం సందర్భంగా బీదలకు అన్నదానం

మందమర్రి,జనవరి 1,(ప్రజాపాలన):-ఎవరైనా పుట్టినరోజు వేడుకలు అంటే గుడికి వెళ్ళడం, క్రొత్త బట్టలు వేసుకోవాడం, కుటుంబసభ్యులతో, స్నేహితులతో విందులు, వినోదాల పేరుతో వేల రూపాయలు ఖర్చు చేస్తారు. కాని గోదావరిఖని పట్టణానికి చెందిన పదాల సాయిప్రసన్న మాత్రం పుట్టినరోజు వేడుకలో నలుగురు పేదవారు కడుపు నిండ బోజనం చేస్తే,వారి ఆశీర్వాదం తోపాటు దేవుని ఆశీస్సులు లభిస్తాయని అనుకున్నది.అనుకున్నదే తడవుగా తన కుటుంబసభ్యులతో,మంచిర్యాల పట్టణంలోని బంధువులతో చర్చించి,వారి సహకారంతో డిసెంబర్ 31,సాయంత్రం తన 17వ జన్మదినాన్ని పురస్కరించుకుని మంచిర్యాల రైల్వే స్టేషన్ సమీపంలో ఉండే యాచకులకు, బీదవారికి అన్నం పొట్లాలు అందించింది. ఈసందర్భంగా ఆమెను ప్రజాపాలన ప్రతినిధులు పలకరించగా తనతోపాటు తోటి వారి ఆకలి తీర్చడం సంతోషం కలిగించిందని తెలిపారు.యుక్త వయసులో తోటివారి ఆకలిని గుర్తించి,జన్మదిన నాడు అందరిలాగే ఆర్భాటాలకు పోకుండా సామాజిక స్పృహతో ఎదుటివారి.ఆకలి తీర్చడం మంచి విషయం అన్ని, యువత ఇలాంటి ఆలోచనతో సమాజంలో కొనసాగలని,సాయి ప్రసన్న కుటుంబ సభ్యులు, పలువురు అభిప్రాయపడ్డారు.





## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



నేరేడుచర్ల ప్రజా పాలన న్యూస్: ఆర్థికపరమైన ఇబ్బంది తో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఇంజవరిగూడెంలో చోటు చేసుకుంది స్థానిక యస్ ఐ సర్దార్ నాయక్, తెలిపిన వివరాల ప్రకారం ఇంజవారి గూడెం చెందిన రైతు ఇంజం సత్యా నారాయణ రెడ్డి( 45) మంగళ వారం నాడు ఇంట్లో పురుగుల మందు తగాగ మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కి ఇద్దరు కుమారులు భార్య ఉన్నారు మృతుని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సర్దార్ నాయక్ తెలిపారు.

## సర్పంచి, వార్డు సభ్యుల రిజర్వేషన్ల గెజిట్ ప్రభుత్వానికి అందజేసిన డీపీవో

సిద్దిపేట: జిల్లాలోని 499 గ్రామపంచాయతీలు, 4,476 వార్డు సభ్యుల స్థానాలకు ఖరారు చేసిన రిజర్వేషన్లను అధికారులు గెజిట్ రూపంలో ప్రచురించారు. జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ వెంకటరామరెడ్డి పేరిట ఆదివారం దీన్ని ప్రచురించారు. హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులకు డీపీవో సురేశ్‌బాబు సోమవారం ప్రతిని అందజేశారు. అనంతరం సిద్దిపేటలో మీడియాకు విడుదల చేశారు. 22 మండలాల్లో గ్రామాల వారీగా సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు ఖరారైన రిజర్వేషన్లను ఇందులో పొందుపర్చారు. దీంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణ దిశగా మరో అడుగు పడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి త్వరలోనే ఎన్నికల ప్రకటన రానుంది. రిజర్వేషన్లు బహిర్గతం కావడంతో సర్పంచి, వార్డు సభ్యుల పదవులపై కన్నేసిన నేతలు రాజకీయాలు షురూ చేశారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునే పని ప్రారంభించారు. గ్రామాల్లో ప్రాబల్యం ఉన్న సామాజిక సంఘాల నేతలు, పార్టీల్లో బలంగా ఉండే నాయకులతో పాటు ప్రధానంగా యువతను లక్ష్యంగా చేసుకొని ప్రణాళికలు అమలు చేసేందుకు కసరత్తు షురూ చేశారు. దీంతో చలికాలంలోనూ గ్రామాల్లో రాజకీయాలు వేడిగా సాగనున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## కబడ్డీ పోటీల విజేతలు నల్గొండ జట్లు

శ్రీరాంపూర్ : పాఠశాల క్రీడా సమాఖ్య రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీల్లో నల్గొండ జట్లు విజేతగా నిలిచాయి. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల జట్లు పోటీ పడగా బాలుర, బాలికల విభాగంలో నల్గొండ, రంగారెడ్డి జట్లు ఫైనల్‌కు చేరుకొన్నాయి.లి సోమవారం జరిగిన మొదటి మ్యాచ్ బాలుర విభాగంలో పోటీ పడగా నిర్ణీత సమయంలో నల్గొండ జట్టు 30 పాయింట్లు సాధించగా రంగారెడ్డి జట్టు 15 పాయింట్లతో ఆగిపోయింది. దీంతో 15 పాయింట్ల తేడాతో నల్గొండ జట్టు విజయం సాధించింది. బాలిక విభాగంలో జరిగిన పోటీలో నిర్ణీత సమయంలో నల్గొండ జట్టు 35, రంగారెడ్డి జట్టు 27 పాయింట్లు సాధించింది. దీంతో 8 పాయింట్ల తేడాతో నల్గొండ జట్టు మొదటి స్థానంలో నిలిచింది.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి మరొకరి పరిస్థితి విషమం

మనోహరాబాద్: పొట్టకూటి కోసం మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాన్ని కారు రూపంలో వచ్చిన మృత్యువు కబళించడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. దండుపల్లి వద్ద ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం మలుపు తీసుకుంటుండగా కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ఎస్సై వరప్రసాద్ తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన ఉప్పరి ముత్యాలు (34), చెర్వి సత్తయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై ముప్పిరెడ్డిపల్లిలో మేస్త్రీ పనికి వెళ్లారు. పని ముగించుకుని తిరిగి రాత్రి 11 గంటల సమయంలో గ్రామానికి వెళుతూ దండుపల్లి మద్ద మలుపు తీసుకుంటుండగా నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వేగంగా వెళుతున్న కారు వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ముత్యాలు అక్కడికక్కడే మృతిచెందాడు. సత్తయ్యకు తీవ్ర గాయాలు అవగా చికిత్స నిమిత్తం జీవిమ్మార్ హైవే అంబులెన్సులో కొంపల్లిలోని ఆసుపత్రికి తరలించారు. మృతుడి బావమరిది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

## ధాన్యం చోరీ కేసులో లారీ డ్రైవర్ అరెస్టు: రూ.5 లక్షల నగదు స్వాధీనం

గజ్వేల్ గ్రామీణ: యజమానిని మోసం చేసి లారీ ధాన్యాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్న ఘటనలో లారీ డ్రైవరును సోమవారం అరెస్టు చేసినట్లు గజ్వేల్ ఏసీపీ నారాయణ తెలిపారు. ప్రజ్ఞాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. జగదేవపూర్ శివారులో ఉన్న వెంకటేశ్వర రైసు మిల్లు నుంచి డిసెంబరు 18న 288.35 క్వింటాళ్ల ధాన్యాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోని పెద్దాపురం తరలించేందుకు లారీలో లోడ్ చేశారు. లారీని అక్కడికి తీసుకు వెళ్లమని డ్రైవర్‌గా పనిచేస్తున్న కృష్ణకు సూచించారు. డబ్బుపై అత్యాశతో అతను లారీ నెంబర్ ప్లేటు మార్చి ధాన్యాన్ని మిర్యాలగూడలోని శివ రైస్ ఇండస్ట్రీస్‌లో రూ.5,04,612కు విక్రయించాడు. లారీ గమ్యస్థానం చేరక పోవడంతో అనుమానం వచ్చిన కృష్ణమూర్తి జగదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న స్థానిక పోలీసులు గజ్వేల్ గ్రామీణ సీఐ శివలింగం ఆధ్వర్యంలో జగదేవపూర్ ఎస్సై సాయిరాం దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ చరవాణి, ఆయా మార్గాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజిలను పరిశీలించి డ్రైవరును అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. దీంతో అతని నుంచి రూ.5 లక్షల నగదును రికవరీ చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కేసు పరిశోధనలో క్రియాశీలకంగా వ్యవహరించిన సిబ్బందికి రివార్డులు ఇవ్వనున్నట్లు ఏసీపీ తెలిపారు.

# సాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు



మహబూబ్‌నగర్:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన రైతుబంధు పథకం కింద నగదు జమ చేసే ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోంది. రబీ సీజన్‌కు సంబంధించి అక్టోబర్ మాసంలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉంది. అయితే, మూడు నెలలు కావొస్తున్నా ఇంకా పూర్తి స్థాయిలో రైతులకు నగదు అందలేదు. వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం 80శాతం రైతుల ఖాతాల్లో నగదు జమ అయినట్లు తెలుస్తున్నా.. వాస్తవానికి ఆ మేరకు కూడా ఖాతాల్లో డబ్బు జమ అయిన దాఖలాలు కనిపించడం లేదు. ఏ గ్రామానికి వెళ్లినా రైతులు తమ ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం జమ కాలేదని, ఎప్పుడు అవుతుందని అధికారులను అడగడం కనిపిస్తోంది. అధికారులు ఖాతాల్లో డబ్బు జమ విషయమై ఎప్పటికప్పుడు సరైన సమాచారం ఇస్తే ఇలాంటి గందరగోళ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉండదు.

**చెక్కులకు బదులు నగదు**

రైతులు పంట పెట్టుబడి కోసం దళారులు, వ్యా పారుల చేతుల్లో మోసపోకుండా తెలంగాణ ప్ర భుత్వం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. గత ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి కింద ఎకరానికి రూ. 4 వేలు అందించారు. ఆ సమయంలో రైతులకు చె క్కులు అందించగా రైతుల్లో ఖాతాల్లో జమ చేసు కుని డబ్బు తీసుకున్నారు. ఇక రబీ సీజన్‌కు సం బంధించి పెట్టుబడులను చెక్కుల రూపంలో పం పిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధం కాగా శాసనసభ ఎన్నికల కోడ్ కారణంగా బ్రేక్ పడింది. ఈ మేరకు రైతులకు చెక్కుల రూపంలో ఇవ్వకుండా వారి ఖాతాల్లో డబ్బు జమ చేయాలని ఎన్నికల కమిషన్ సూచించింది. దీంతో రైతుల ఖాతాల వివరాలు సేకరించిన అధికారులు ఆయా ఖాతాల్లో నగదు జమ చేయడం ఆరంభించారు.

ఈ ప్రక్రియ అక్టోబర్‌లో ప్రారంభం కాగా.. మూడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాలేదు. ఇప్పటి వరకు 80 శాతం మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని, మిగతా 20 శాతం మంది రైతుల ఖాతాల్లో డబ్బు జమ కావాల్సి ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో డబ్బు అందని రైతులు అసలు డబ్బు వస్తుందా, రాదా అంటూ ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులను అడుగుతుండగా.. రేపు, మాపు అంటూ రకరకాలు కారణాలు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. ఏది ఏమైనా రబీ పెట్టుబడి, ఇతర ఖర్చులకు అండగా ఉంటుందనుకుంటున్న డబ్బు అందక వారు ఇబ్బంది పడుతున్నారు.

**ఖాతాల వివరాలు లేక...**

జిల్లాలో రైతుబంధు పథకానికి సంబంధించిన అర్హులైన రైతులు 2,77,790 మంది ఉన్నారు. వీరందరికీ కలిపి రూ.316.86 కోట్ల నగదు జమ కావాల్సి ఉంది. వ్యవసాయశాఖ ఏఈఓలు ఇప్పటి వరకు 2,50,017 మంది రైతుల బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఈ అకౌంట్లలో రైతుబంధు నగదు జమ చేసేందుకు హైదరాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయానికి నివేదించారు. ఈ మేరకు కమిషనరేట్ అధికారులు 2,45,500 ఖాతాల్లో డబ్బు చేసేలా ట్రెజరీకి పంపించారు.

అలా ఇప్పటి వరకు 2,34,300 మంది రైతులకు సంబంధించి రూ.276.34 కోట్లు ఖాతాల్లో జమ అయింది. అంటే 80 శాతం మంది రైతులకు రైతు బంధు నగదు అందినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నా యి. ఇంకా 15,717 మంది రైతుల ఖాతాల్లో డ బ్బు జమ కావాల్సి ఉంది. వీరితో పాటు ఖాతా నంబర్లు పంపినా వివరాలు సరిగా లేకపోవడం వంటి కారణాలతో దాదాపు 1,800 ఖాతాలకు సంబ్యంధించిన నగదు సుమారు రూ.45 లక్షలు తిరిగి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఆ రైతుల ఖాతాల వివరాలను మరోసారి సేకరించి పంపించనున్నట్లు తెలిపారు.

**బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు**

రబీ పంటకు సంబంధించి రైతుబంధు నగదు అకౌంట్లలో జమ కావడంలో జాపం జరుగుతుంది. ప్రక్రియ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇంకా పూర్తి స్థాయిలో రైతుల ఖాతాల్లో డబ్బు జమ కావడం లేదు. బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేని వారితో పాటు అసలే ఖాతాల నంబర్లు ఇవ్వని వారి వివరాల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాలు, రసాయన ఎరువులు కొనుగోలు చేయాల్సిన తరుణంలో చేతుల్లో చిల్లిగవ్వ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

గత ఖరీఫ్‌లోపెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం చెక్కుల రూపంలో అందజేయగా.. సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ కారణంగా ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు సంబ్యంధించిన బ్యాంకు ఖాతాలు, ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం వివరాలను సేకరించి కమిషనర్‌కు పంపించారు. ఆయా రైతుల ఖాతాల్లో దశల వారీగా రైతు బంధు డబ్బును జమ చేస్తున్నారు. ఈ ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగుతుండడంతో ఎప్పుడు డబ్బు జమ అవుతుందో తెలియక రైతులు ప్రతిరోజూ బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారు.

**ఇప్పటి వరకు రూ.276.34 కోట్లు జమ**

జిల్లాలోని 2,34,300 మంది రైతుల అకౌంట్లలో ఇప్పటి వరకు రూ. 276.34 కోట్లు పెట్టుబడి సాయం జమ చేశాం. ఇంకా 27,773 మంది రైతులు తమ అకౌంట్ నంబర్లు ఇవ్వాల్సి ఉంది. ఆయా రైతులు కూడా త్వరగా తమ పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు అకౌంట్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను ఏఈఓలను అందజేయాలి. అలా ఇచ్చిన వారి ఖాతాల్లో 15%--%20 రోజుల్లో రైతు బంధు నగదు జమ చేస్తాం. %--% సుచరిత, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

# సర్కారు ఆస్పత్రులలో వసతులు కరువు




నిజామాబాద్: సర్కారు చర్యల వల్ల ప్రభుత్వ ఆస్పత్రులకు కొత్త కళ వచ్చింది. కేసీఆర్ కిట్ కారణంగా సర్కారు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. అయితే, ప్రసవాల సంఖ్యతో పాటే మాతృ, శిశు మరణాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. సరైన సౌకర్యాలు కరువవడం, అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనే వ్యవస్థ లేకపోవడం మూలంగా మరణాల సంఖ్య పెరుగుతోంది!. జిల్లా వ్యాప్తంగా దవాఖానాల్లో ఈ ఏడాది సంభవించిన మరణాలు భయపెట్టిస్తున్నాయి. ఆర్నెళ్ల వ్యవధిలో 101 మంది నవజాత శిశువులు పురిట్లోనే కన్నుమూయడం, ఆరుగురు బాలింతలు ప్రసవ సమయంలో మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది.

వసతులు కరువు.. జిల్లా వ్యాప్తంగా 33 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు ఒక ఏరియా ఆస్పత్రి, నాలుగు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతో పాటు మరో 92 వరకు ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోజుకు సుమారు 40 నుంచి 50 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇక, ఆర్మూర్, బోధన్, డిచ్‌పల్లితో పాటు మోర్తాడ్, వర్ని, నవీపేట ఆస్పత్రులలో మరో 50 వరకు ప్రసవాలు నమోదవుతున్నాయి. అయితే, అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు బాలింతలు, శిశువులకు సరైన వైద్యసౌకర్యాలు అందడం లేదు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనే వెంటిలేటర్ సదుపాయం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనే వ్యవస్థ లేకపోవడంతో బాలింతలు, శిశువులు మృత్యువాతపడుతున్నారు.

**అందుబాటులో లేని అత్యవసర చికిత్స**

కేసీఆర్ కిట్ ప్రభావంతో ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగింది. అయితే, అందుకు తగినట్లుగా వసతులు లేకపోవడం కారణంగా మరణాల సంఖ్య పెరుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన గర్భిణులు, బాలింతలు, శిశువులకు సరైన వైద్యచికిత్సలు అందడం లేదు. ప్రసవ సమయంలో గర్భిణులకు రక్తం తక్కువగా ఉండడం, ఫిట్స్ రావడం, శిశువు ఉమ్మ నీరు మింగడం, తక్కువ బరువుతో పుట్టడం తదితర కారణాలతో పాటు ఇతర సమస్యలు తలెత్తుంటాయి. అయితే, ఇలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు, సరైన వైద్య చికిత్స అందించే సదుపాయం ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేదు. ఫలితంగా మాతృ, శిశు మరణాల సంఖ్య పెరుగుతోంది. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేక, హైదరాబాద్‌కు తీసుకెళ్లలేక పేద, మధ్యతరగతి తల్లులకు కడుపుకోత మిగులుతోంది. ఇటీవల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కడుపులోనే శిశువు మృతి చెందినడంతో ఆగ్రహించిన బంధువులు ఆస్పత్రిపై దాడిచేశారు. అలాగే, నవీపేట మండలానికి చెందిన ఓ బాలింత ప్రసవానంతరం మృతి చెందింది. ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఫలితంగా కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 101 మంది శిశువులు, ఆరుగురు బాలింతలు ప్రసవ సమయంలోనే మృత్యువాత పడ్డారు.

**సమన్వయ లోపమే కారణమా..?**

మాతృ శిశు మరణాలను తగ్గించేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖ సమన్వయంతో పని చేయాల్సి ఉంది. అయితే, అంతటా సమన్వయ లోపం కనిపిస్తోంది. తమ గ్రామ పరిధిలో గర్భిణుల వివరాలను ఏఎన్ఎంలు రిజిస్టర్ చేసుకుంటారు. అనంతరం వారికి అంగన్‌వాడీలలో గుడ్లు, పౌష్టికాహారం అందిస్తుంటారు. గర్భిణుల్లో రక్తహీనత లేకుండా మాత్రలు అందించడం, ప్రతి నెలా బరువును పరిశీలించడం వంటివి చేయాలి. రెండు శాఖలు సమన్వయంతో గర్భిణులకు పౌష్టికాహారం అందించాల్సి ఉంటుంది. అలాగే గర్భిణికి తగు సలహాలు, సూచనలు అందించాలి. అయితే, చాలా చోట్ల క్షేత్ర స్థాయిలో శిశు, సంక్షేమ శాఖ, వైద్యారోగ్య శాఖ సిబ్బంది మధ్య సమన్వయం కుదరడం లేదు. దీంతో ప్రసవ సమయంలో గర్భిణులు, శిశువులకు ప్రమాదకరమైన పరిస్థితులు తలెత్తుతున్నాయి. మరికొందరు బాలింతలు వైద్యసిబ్బంది సలహాలు, సూచనలు పట్టించుకోక పోవడం, పురాతన పద్ధతులు పాటించడం కూడా మరణాల పెరుగుదలకు కారణమవుతున్నాయి.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం..జిల్లా వ్యాప్తంగా మాతృ, శిశు మరణాల నివారణకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నాం. గతంలో కంటే ప్రస్తుతం వీటి మరణాల సంఖ్య తగ్గింది. ప్రమాదకర పరిస్థితుల వల్ల అప్పుడప్పుడు మరణాలు సంభవిస్తున్నాయి. వీటిని పూర్తి స్థాయిలో నివారించేందుకు కృషి చేస్తున్నాం. %--% డా.సుదర్శనం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి